అభివృద్ధి పనుల పరిశీలన


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఎల్‌బీనగర్: ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడంతో పాటు ఆరోగ్యం పెంపొందించుకోవడానికి పార్కుల్లో అన్ని రకాల వసతులు ఏర్పాట్లు చేస్తున్నామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్–1లో జరుగుతున్న ఓపెన్ జిమ్, విజయపురి కాలనీ ఫేజ్–1 కాలనీలో జరుగుతున్న సీసీరోడ్డు పనులను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. అభివృద్ధి పనులను త్వరితగతిగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్పొరేటర్ వెంట ఏఈ నరేందర్, నాయకులు పురుషోత్తం రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

సహచరుడికి ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

నాగోలు: మహావీర్ హరినా వనస్థలి నేషనల్ పార్క్ మన్సూరాబాద్ గేట్ వద్ద వాకింగ్ చేసే వెంకటేశ్వర్లు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురి కావడంతో గత ఆరు నెలలుగా ఓ రిహాబిలిటేషన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల భారం మోస్తున్న కుటుంబానికి మహావీర్ హరినా వనస్థలి వాకర్స్ అసోసియేషన్ అందరూ కలిసి రూ.1,03,001 వారి కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు. వెంకటేశ్వర్లు ఆరోగ్యం మళ్లీ కుదుట పడుతుందని వారి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో విక్రమ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, జగదీష్ యాదవ్, నరసింహులు, వెంకటయ్య, శ్రీనివాస్, కిషన్, గోపీ, కృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం


మాట్లాడుతున్న రతన్

వనస్థలిపురం: తమ జీవితాలను పణంగా పెట్టి విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరుల కుటుంబాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలంగాణ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. అమరవీరుల స్మారక వారోత్సవాలను పురస్కరించుకుని అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం వనస్థలిపురం ప్రశాంత్ నగర్‌లోని కనకదుర్గా దేవాయం కల్యాణ మండపంలో పోలీస్ అమరవీరుల ధర్మపత్నులకు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఎం.రతన్, పెన్షనర్స్ జేఏసీ చైర్మన్ లక్ష్మయ్య, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ గౌసుద్దీన్, రిటైర్డ్ అడిషనల్ కలెక్టర్ రవీంద్రబాబు, కనకదుర్గా దేవాలయం చైర్మన్ సంరెడ్డి భుజంగరెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.శ్రీనివాస రావు పాల్గొన్నారు.

నేడు పద్మశాలీ దసరా మేళా


మాట్లాడుతున్న గణేష్‌నేత

నాగోలు: పద్మశాలీ సంఘం ఎల్‌బీనగర్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం(నేడు) నిర్వహించనున్న 22వ పద్మశాలి దసరా మేళాకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సంఘం అధ్యక్షులు పున్న గణేష్‌నేత తెలిపారు. శనివారం ఆటోనగర్‌లోని అనన్య ఏకో పార్కులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6 గంటలకు వరకు దసరా మేళా కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలోని పద్మశాలి ప్రముఖులు, కుటుంబ సభ్యులు హాజరై దసరా మేళాను విజయవంతం చేయాలని కోరారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, శ్రీధర్‌బాబు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, బీసీ కమిషనర్ సభ్యుడు రాపోలు జయప్రకాష్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో కొకుంట్ల రవితేజ, లక్ష్మీనారాయణ, మేముల రాము, రాపోలు సుధాకర్, బురుగు తులసీదాస్ పాల్గొన్నారు.

17న బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక

ఎల్‌బీనగర్: బ్రాహ్మణ సంక్షేమ సంఘం వనస్థలిపురం ఆధ్వర్యంలో నవంబర్ 17న బ్రాహ్మణ వధూవరుల 16వ వార్షిక పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు గౌరవ అధ్యక్షుడు చింతపల్లి మంగపతి, అధ్యక్షుడు పోచంపల్లి శ్రీధర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. వనస్థలిపురం గురుద్వారా పక్కన ఉన్న సీతా రామచంద్ర స్వామి దేవాలయంలో ఉదయం 8 గంటలకు పరిచయ కార్యక్రమం ప్రారంభమవుతుందని దరఖాస్తులు వివాహ సమాచార కేంద్రం సచివాలయ గాయత్రి భవన్‌లో అందుబాటులో ఉంటాయని పూర్తి వివరాలకు 6302454218 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు.
టమాట రూ. 40, వంకాయ రూ. 35, బెండ రూ. 50, పచ్చిమిర్చి రూ. 23–45, కాకర రూ. 35, బీర రూ. 45, క్యాబేజి రూ. 26, ఫ్రెంచి బీన్స్ రూ. 115, క్యారెట్ రూ. 40, దొండ రూ. 25–28, చిక్కుడు రూ. 28–65, గోకర రూ. 35, బీట్‌రూట్ రూ. 30, క్యాప్సికం రూ. 75, ఆలు రూ. 37, దోస రూ. 35, సొర రూ. 17, పొట్ల రూ. 23, ఉల్లిగడ్డ రూ. 44, చామగడ్డ రూ. 45. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.


చంచల్‌గూడ చౌరస్తా వద్ద నిర్మాణంలో ఉన్న స్టీల్‌బ్రిడ్జి

ప్రారంభమై 4 ఏళ్లు..

పూర్తికి ఇంకెన్నాళ్లో?

నిలిచిపోయిన సైదాబాద్ స్టీల్‌బ్రిడ్జి పనులు

మలక్‌పేట నల్గొండ చౌరస్తా నుంచి సంతోష్‌నగర్ ఓవైసీ హాస్పిటల్ కూడలి వరకు నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రహదారిపై వెళ్లే వాహనదారులకు ప్రతీరోజూ ట్రాఫిక్ చిక్కులను దాటుకుని ముందుకెళ్లాలి. ఇక్కడి ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారం కోసం మలక్‌పేటలోని నల్గొండ చౌరస్తా దాటిన తర్వాత ఉండే ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్ వద్ద నుంచి ఓవైసీ కూడలి వరకు స్ట్రాటెజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ (ఎస్ఆర్‌డీపీ) కింద స్టీల్ వంతెన నిర్మాణాన్ని 2020 జూలైలో ప్రారంభించారు. సైదాబాద్

- అలైన్‌మెంట్ వివాదం, వేధిస్తున్న నిధుల కొరత
- సయోధ్య కుదరక ముందుకు సాగని పనులు
- వాహనదారులకు తప్పని తిప్పలు

సుమారు మూడున్నర కిలో మీటర్ల పొడవైన ఈ వంతెన నిర్మాణ పనులను రెండేళ్లలో పూర్తి చేస్తామని అప్పటి మంత్రి కేటీఆర్ బహిరంగంగా ప్రకటించారు. కానీ నాలుగేళ్లవుతున్నా సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణం ముందుకు సాగటం లేదు. మొదట నిర్ధారించిన నిర్మాణం అలైన్‌మెంట్‌ను మార్చారని, అందు కోసం నిర్మాణం పురాతన ఆలయం మీదుగా వెళ్తూ హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా సాగుతుందని వివాదం తలెత్తడంతో పనులు ఆగిపోయాయి. దీనికి తోడు నిధులు కొరత కూడా వెంటాడుతుంది. వివిధ కారణాల వల్ల సైదాబాద్‌లో నిర్మిస్తున్న స్టీల్‌బ్రిడ్జి నిర్మాణం ఆగుతూ సాగుతూ ఉంది.

పూర్తయితే రయ్ రయ్..

నగరం నుంచి విమానాశ్రయానికి వెళ్లేవారు, శ్రీశైలం, కర్నూలు వైపువెళ్లే వాహనదారులు, రక్షణ రంగ సంస్థల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు ఈ రహదారి మీదుగా ప్రయాణిస్తుంటారు. మామూలు రోజుల్లో మలక్‌పేట నుంచి ఓవైసీ కూడలికి వెళ్లేందుకు విపరీతమైన ట్రాఫిక్ కారణంగా ఎక్కువ సమయం పడుతుంది. ఇక్కడ స్టీల్‌వంతెన అందుబాటులోకి వస్తే కేవలం నిమిషాల వ్యవధిలో దూసుకుపోవచ్చు. ఈ రహదారిపై ప్రయాణించే వారి ట్రాఫిక్ కష్టాలకు స్టీల్‌బ్రిడ్జి నిర్మాణంతో శాశ్వత పరిష్కారం దక్కుతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

వంతెన వివరాలు..

స్టీల్ వంతెన పొడవు:	2.58 కి.మీ.
కారిడార్ పొడవు:	స్టీల్ వంతెనకు ఇరువైపులా నిర్మించే ర్యాంపులతో కలిపి 3.38 కి.మీ.
వెడల్పు:	వంతెనపై ఇరువైపులా ప్రయాణించేలా రెండేసి చొప్పున మొత్తం నాలుగు లైన్లు
పిల్లర్లు:	88 పిల్లర్లు
అంచనా వ్యయం:	రూ. 523.37 కోట్లు
ఆస్తుల సేకరణ వ్యయం:	153.37 కోట్లు

అలైన్‌మెంట్ మార్పుతో వివాదం మొదలు...

స్టీల్‌బ్రిడ్జి నిర్మాణం ప్రారంభమైనప్పుడు నిర్ధారించిన అలైన్‌మెంట్‌ను అధికారులు మార్చారని పలువురు నాయకులు ఆరోపిస్తున్నారు. అలైన్‌మెంట్ మార్చటంతో బ్రిడ్జి నిర్మాణం సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న పురాతన హనుమాన్ ఆలయం మీదుగా వెళ్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయం మీదుగా నిర్మాణం వెళ్లటం సరి కాదని వారి వాదన. అధికారులు వారితో పలు దఫాలుగా చర్చించినా ఫలితం మాత్రం తేలలేదు. గత మార్చిలో పెద్ద ఎత్తున హిందూ సం ఘాలు, ఆలయ కమిటీ ప్రతినిధులు సైదాబాద్ రహదారిపై నిరసనకు దిగారు. ఆలయం మీదుగా ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్మాణం సాగనివ్వమని పట్టుబడటంతో పనులకు బ్రేక్ పడింది. సైదాబాద్ ప్రధాన రహదారిపై నిత్యం రాకపోకలు సాగించే వారి ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారం కోసం నిర్మిస్తున్న స్టీల్‌బ్రిడ్జి పనులు ముందుకు సాగటానికి అధికారులు, నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు సయోధ్య కుదుర్చుకుని పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


వివాదానికి కారణమైన స్థలం

అధికారుల సమన్వయ లోపమే..



జీహెచ్ఎంసీ, ఎస్ఆర్‌డీపీ అధికారుల సమన్వయ లోపమే కారణంగా వంతెన నిర్మాణ పనులు ముందుకు సాగటం లేదు. రహదారి విస్తరణ కోసం ఆస్తుల స్వాధీన ప్రక్రియ కూడా సవ్యంగా జరగలేదు. నిర్మాణపనుల జాప్యం కారణంగా సైదాబాద్ ప్రధాన రహదారిపై దశాబ్దాలుగా ఉపాధి పొందుతున్న వ్యాపారులు నష్టపోతున్నారు. ఆలయం పై నుంచి నిర్మాణం వద్దని మొదటి నుంచి చెపుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి అలైన్‌మెంట్‌ను మార్చి సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలి.
– జీ.సుభాష్‌చందర్జీ, మాజీ డిప్యూటీ మేయర్

వంతెనను అందుబాటులోకి తేవాలి..



రెండేళ్లలో పూర్తి కావాల్సిన స్టీల్‌బ్రిడ్జి నిర్మాణం నాలుగేళ్లైనా కొలిక్కి రాకపోవటం శోచనీయం. నగరం నుంచి ఇతర జిల్లాలకు వెళ్లే వాహనాలు నిత్యం సైదాబాద్ ప్రధాన రహదారి నుంచే వెళ్తుంటాయి. నాలుగేళ్లుగా సాగుతున్న పనులతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అధికారులు సత్వరమే తగిన నిర్ణయం తీసుకొని, నిర్మాణం త్వరగా పూర్తి చేసి వంతెనను అందుబాటులోకి తేవాలి.
రమణ్‌సింగ్, బీజేపీ యువమోర్చా రాష్ట్ర నాయకుడు

డీఈ, ఈఈ కార్యాలయాల తరలింపు

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ డీఈ, ఈఈ (ఇంజినీరింగ్ సెక్షన్) కార్యాలయాలను ఎన్‌టీఆర్ కూరగాయల మార్కెట్‌లోని జేడీ కార్యాలయానికి తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రెండు జిల్లాల ఇంజనీరింగ్ కార్యకలాపాలు సోమవారం నుంచి జేడీ కార్యాలయం నుంచి పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయి సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ శ్యామ్‌కుమార్ తెలిపారు. దిల్‌సుఖ్‌నగర్ వాసన్ ఐ కేర్ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించే ఈ శిబిరంలో ప్రముఖ కంటి వైద్య నిపుణుల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: నవంబర్ 5, 6 తేదీల్లో ఖమ్మంలో జరిగే రాష్ట్రస్థాయి గిరిజన సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముడావత్ ధర్మా నాయక్, గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గోపీనాయక్ కోరారు. ఆర్‌కేపురం డివిజన్‌లో శనివారం మహాసభల సమ్మేళనానికి సంబంధించిన వాల్ పోస్టర్‌లను విడుదల చేసి మాట్లాడారు. ఈ సమ్మేళనంలో గిరిజన సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తామన్నారు. గిరిజన వ్యవస్థాపక నాయకులు గుగులోత్ ధర్మా నాయక్ ప్రథమ వర్ధంతి సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోమ్లా నాయక్, ఈశ్వర్ నాయక్, పవన్ నాయక్, సాయి నాయక్, సింధు ప్రియ, బాలమణి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోనే కార్యకర్తలకు గుర్తింపు


కోదండరెడ్డిని సన్మానిస్తున్న కోట్ల శ్రీనివాస్

సైదాబాద్: పార్టీ పటిష్టతకు కృషి చేసే కార్యకర్తలు, నాయకులకు కాంగ్రెస్‌లో తగిన గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర వ్యవసాయ రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. శనివారం టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు ఆయనను కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ప్రజలతో మమేకమవుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అర్హులైన వారికి అందేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సీహెచ్ బాలరాజు, కార్యదర్శి మామిడి కృష్ణకుమార్, రాష్ట్ర బీసీ సెల్ కన్వీనర్ పృథ్వీరాజ్, బాలపోచయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ఫిల్టర్ అందజేత

నాగోలు: విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని యూనియన్ బ్యాంక్ విశ్రాంత అధికారి రామారావు అన్నారు. కొత్తపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు శనివారం ఆయన వాటర్ ఫిల్టర్ అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. తాము ప్రభుత్వ పాఠశాలలోనే విద్యనభ్యసించామని, ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. ప్రధానోపాధ్యాయుడు సాయన్న మాట్లాడుతూ.. తమ పాఠశాలకు వాటర్ ఫిల్టర్ అందజేసిన రామారావుకి ధన్యవాదాలు అన్నారు. అనంతరం రామారావును ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొమర్రాజు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కొమర్రాజు జ్ఞానాకుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



‘హామీల అమలులో విఫలం’

హస్తినాపురం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమయిందని హస్తినాపురం డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకూ పోరాడుతూనే ఉంటామన్నారు.

పిల్లలను రోజూ పాఠశాలలకు పంపాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

నాగోలు: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతి రోజూ పాఠశాలలకు పంపించాలని జైపురికాలనీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు ఇంటి వద్ద తమ పిల్లలు ఏం చదువుతున్నారో గమనిస్తూ ఉండాలన్నారు. పాఠశాలలో నేర్చుకున్న అంశాలను ఇంటి వద్ద మరోసారి చదువుకునేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు అనంత రెడ్డి, మేరీ బ్యూల, సుధా రాణి, రమాదేవి పాల్గొన్నారు.



ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని కాలనీలు, బస్తీల్లో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఒంటరిగా బయటకు వెళ్తే మూకుమ్మడిగా దాడిచేసి గాయపరుస్తున్నాయి. సాయంత్రం విద్యార్థులు, ట్యూషన్లకు వెళ్లివచ్చే సమయంలో వెంబడిస్తుండటంతో జంకుతున్నారు. కుక్కల బెడద నుంచి కాపాడాలని పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తే అప్పుడప్పుడు వచ్చి కుక్కలు దొరక్కపోవడంతో వెనుదిరుగుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వీధి కుక్కల బెడద నుంచి కాపాడాలని ఆయా కాలనీలవాసులు కోరుతున్నారు. – వనస్థలిపురం

వాకింగ్‌కు వెళ్లి ఒకరు.. సొంతూరికి వెళ్తానని మరొకరు

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యం


ఫర్వీన్ ఖాతూన్

మలక్‌పేట: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటన మలక్‌పేట, నాగోలు పోలీస్ స్టేషన్ల పరిధుల్లో చోటు చేసుకున్నాయి. మలక్‌పేట ఎస్.ఐ సురేష్ వివరాల ప్రకారం.. సలీంనగర్‌కు చెందిన మన్సూర్ అలీఖాన్‌కు 2008లో ఫర్వీన్ ఖాతూన్(31)తో పెళ్లి జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు. ఈ నెల 10న సాయంత్రం వాకింగ్‌కు వెళ్తున్నానని చెప్పి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. గతంలో మూడు సార్లు ఇలాగే వెళ్లి వచ్చింది. ఈ సారి ఎంతకీ రాకపోవడంతో బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో మన్సూర్ అలీఖాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నాగోలు స్టేషన్ పరిధిలో..


వీర వెంకట శ్రీనివాస్

నాగోలు: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. నాగోలు పోలీసుల వివరాల ప్రకారం..ఏపీలోని ఈస్ట్ గోదావరి జిల్లా కడియంకు చెందిన నార్కేడిమిల్లి వీర వెంకట శ్రీనివాస్(42) నగరానికి వచ్చి నాగోలు బండ్లగూడలోని శ్రీనివాస్ హోమ్ కేర్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఈ నెల 6న సొంత గ్రామానికి వస్తున్నానని కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి చెప్పాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు

- సౌత్ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ సుభాష్


మాట్లాడుతున్న డీసీపీ కాంతిలాల్ సుభాష్

సైదాబాద్: శాంతి భద్రతకు విఘాతం కలిగితే కఠిన చర్యలు తప్పవని సౌత్ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ హెచ్చరించారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం ఆయన సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో సౌత్ఈస్ట్ జోన్ పరిధిలోని 50 హోటళ్లు, లాడ్జీల యజమానులు, నిర్వాహకులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రజా భద్రతా చట్టం, ట్రేడ్ లైసెన్స్ నిబంధనలు, బీఎన్ఎస్ఎస్ చట్టాలకు అనుగుణంగా హోటళ్లలో నిబంధనలు పాటించాలన్నారు. హోటళ్లలో సందర్శకుల రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించాలని, స్థానిక పీఎస్ ఎస్‌హెచ్‌ఓకు రోజువారీ వివరాలు అందించాలన్నారు. లాడ్జీలలో ఉండే వ్యక్తుల ఐడీలను తప్పని సరిగా తీసుకోవాలన్నారు. హోటళ్లలో తప్పని సరిగా బ్యాక్‌అప్‌తో కూడిన సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు. గేమింగ్, డ్రగ్స్ తదితర చట్ట విరుద్ధమైన ప్రయోజనాల కోసం ఆయా ప్రాంగణాలను వినియోగిస్తున్నారని గుర్తిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జోన్ అడిషనల్ డీసీపీ టి.స్వామి, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రహదారుల ఆధునీకరణకు ప్రాధాన్యం


పనులు ప్రారంభిస్తున్న జంగం శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీలలోని రహదారుల ఆధునీకరణకు ప్రాధాన్యం ఇస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తెలిపారు. శనివారం డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రహదారి పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ఆయా విభాగాల అధికారులు పరిశీలిస్తుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం, గోపి, మొగిలి, శ్రీను, శంకర్, వెంకటయ్య, దుర్గాకిషన్, మోహన్ పాల్గొన్నారు.